నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, శనివారం 7 జూన్ 2025 | KAMAREDDY

సర్కారుపై ఉద్యోగుల అసంతృప్తి...

దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఐదు డీఏలు పెండింగ్‌లో లేవు. ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే కాంగ్రెస్ పాలనలో ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండడంపై ఉద్యోగ వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. 15 రోజుల్లో పెండింగ్ బిల్లులు క్లియర్ చేస్తామని ప్రభుత్వ పెద్దలు ఇటీవల హామీ ఇచ్చారు. కానీ ఇప్పటికీ 10 శాతం కూడా క్లియర్ కాలేదు. నెలకు రూ.650 కోట్లు బిల్లులు క్లియర్ చేస్తామని ఇచ్చిన హామీని ఉల్లంఘించిన రేవంత్ ప్రభుత్వం.. ఉద్యోగుల్లో నమ్మకం కోల్పోయింది. ప్రజలకు సంక్షేమ పథకాలు ఇస్తున్నట్లే పెండింగ్ బిల్లులను ఎందుకు మంజూరు చేయడం లేదని ఉద్యోగ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట.. అధికారంలో ఉన్నప్పుడు మరో మాట మాట్లాడడం కరెక్ట్ కాదంటూ మండిపడుతున్నాయి. ఖజానాకు జ్వరం వచ్చింది. పత్యం చేయాలని సీఎం అనడంపైనా ఉద్యోగ వర్గాల్లో నిరసన వెల్లువెత్తుతున్నది. ఒక్క ఉద్యోగులకు మాత్రమే ఈ నీతి సూత్రాలు వర్తిస్తాయా? సీఎం, మంత్రులు, ఐఏఎస్‌లకు పత్యం వర్తించదా? అంటూ అని ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ ఉద్యోగులం అడ్డా మీది కూలీలమా? ప్రతి దానికీ అడుక్కోవాల్నా అంటూ మండిపడుతున్నారు.



యుద్ధ ప్రాతిపదికన పెండింగ్ బిల్లులను చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని ఉద్యోగ సంఘాలు ప్రధానంగా డిమాండ్ చేశాయి. ఉద్యోగుల హెల్త్ స్కీం (ఈహెచ్ఎస్)ను పూర్తిస్థాయిలో అమలుచేయాలని, కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి, పాత పింఛన్ విధానం అమలు చేయాలని కోరాయి. 51 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ అమలు చేయాలని, స్థానిక ప్రాతిపదికన అదనపు పోస్టులను సృష్టించి జీవో 317ను అమలుచేయాలని విజ్ఞప్తి చేశాయి. అన్ని ప్రభుత్వ శాఖల్లో ప్రమోషన్ల కమిటీ (డీపీసీ)లను ఏర్పాటు చేసి, ప్రమోషన్లు కల్పించాలని, సాధారణ బదిలీలు తక్షణం చేపట్టాలని.. ఇలా ప్రధాన డిమాండ్లను ఉద్యోగ సంఘాలు ప్రభుత్వం ముందుపెట్టాయి. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను జూన్ లోపు పరిష్కరించకపోతే సామూహిక సెలవులు పెట్టేందుకు, పెన్‌డౌన్ చేపట్టేందుకు ఉద్యోగ జేఏసీ సిద్ధమైంది. ఉద్యోగుల డిమాండ్ల ను ఏమాత్రం పట్టించుకోని మంత్రిమండలి.. ఒక డీఏ ఇప్పుడు, మరోటి ఆర్నెళ్ల తర్వాత ఇచ్చేందుకు ముందుకొచ్చింది. సర్కారు నిర్ణయంపై అసంతృప్తితో ఉన్న ఉద్యోగ జేఏసీ.. ఉద్యమ కార్యాచరణలో భాగంగా జూన్ 9న చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో వారి పంథా ఏ విధంగా ఉండబోతున్నదనేది ఆసక్తిగా మారింది.

భగ్గుమంటున్న ఉద్యోగులు



- డిమాండ్లను పట్టించుకోని ప్రభుత్వం
- ఐదు డీఏలకు రెండే.. ఇప్పుడిచ్చేది ఒక్కటే..
- మంత్రిమండలి నిర్ణయాలపై ఉద్యోగుల రుసరుస
- ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకునేందుకు రెడీ
- సమస్యల పరిష్కారంపై పోరుబాటకు కార్యాచరణ
- జేఏసీ నేతృత్వంలో దశల వారీగా నిరసన కార్యక్రమాలు

నిజామాబాద్, జూన్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : హామీలు ఎగ్గొట్టి రైతులు, మహిళలను మోసగించిన రేవంత్ సర్కారు.. చివరకు ఉద్యోగులను కూడా వంచించింది. డీఏలతో పాటు పీఆర్‌సీ అమలు విషయంలో ప్రభుత్వం మొండిచేయి చూపింది. దీంతో ఉద్యోగ సంఘాలు భగ్గుమంటున్నాయి. ఏడాదిన్నర దాటినా ఇచ్చిన హామీలను అమలు చేయక పోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. పూటకో మాట చెబుతూ కాలం గడుపుతుండడంపై అసంతృప్తితో ఉన్న ఉద్యోగ సంఘాలు పోరుబాటకు సిద్ధమవుతున్న తరుణంలో భయపడిన ప్రభుత్వం కంటితుడుపు చర్యలకే పరిమితమైంది. ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండగా, ఒక డీఏ ఇప్పుడు ఇవ్వాలని, మరొకటి ఆర్నెళ్ల తర్వాత ఇవ్వాలని మంత్రిమండలి తాజాగా నిర్ణయించడంపై ఉద్యోగ సంఘాలు రుసరుసలాడుతున్నాయి.

డీఏ అమలు అన్నది ఉద్యోగుల ప్రాథమిక హక్కు. అయినప్పటికీ కాంగ్రెస్ సర్కారు ఈ విషయంలో తాత్సారం చేస్తూ తమ మనోభావాలను దెబ్బ తీస్తుండడంతో ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నది. న్యాయంగా రావాల్సిన డీఏ బకాయిలతో పాటుగా పీఆర్‌సీ అమలుపై మాట దాటవేయడం సరికాదని ఉద్యోగులు, ఉపాధ్యాయులు సర్కారుపై మండిపడుతున్నారు.

ఉద్యోగులతో కాంగ్రెస్ చెలగాటం..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల సమస్యలను గాలికొదిలేసింది. వారికి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కింది. డిమాండ్ల సాధనకు ఉద్యోగులు జేఏసీగా ఏర్పడి నిలదీస్తుంటే ప్రభుత్వం ఉల్టా వారిపైనే నిందలు మోపుతున్నది. వారి జీవితాలతో చెలగాటమాడుతున్నది. ప్రస్తుతం చెల్లించాల్సిన డీఏ బకాయిలు 5 ఉండగా, జూలై నెలతో వీటి సంఖ్య 6కు చేరనుంది. ప్రతి ఆర్నెళ్లకోసారి డీఏలు అమలు చేయాల్సిన బాధ్యత ఉండగా, సర్కారు తప్పించుకుంటున్నది. సంక్షేమ కార్యక్రమాలకే నిధులు లేవంటూ సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటనలు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తుండటంపై విస్మయం వ్యక్తమవుతున్నది. ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను అమలు చేయలేకనే రేవంత్‌రెడ్డి ఈ రకమైన వాదనను ప్రచారంలోకి తెస్తున్నాడన్న అభిప్రాయం బలంగా వినిపిస్తున్నది.

పీఆర్‌సీ మాటెత్తకపోవడం విడ్డూరం..

ప్రభుత్వం పీఆర్సీ మాటెత్తక పోవడం విడ్డూరంగా ఉన్నది. పెరుగుతున్న ద్రవ్యోల్బణానికి అనుగుణంగా వర్తించే డీఏలను తప్పనిసరిగా ఎప్పటికప్పుడు మంజూరు చేయాల్సిన బాధ్యత రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ఉన్నది. అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంగా ఒక్క డీఏ కూడా ఇవ్వకపోవడమంటే ఉద్యోగులను మోసం చేయడమే.

- చకినాల అనిల్‌కుమార్, టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

ప్రభుత్వ నిర్ణయం నిరాశ పరిచింది..

ఐదు డీఏలు పెండింగ్‌లో ఉంటే ఇప్పుడు ఒకటే ఇచ్చారు. ఆర్నెళ్లకు మరోటి ఇస్తామంటున్నారు. ప్రభుత్వ తీరు సరికాదు. కనీసం మూడు డీఏలు వెంటనే అమలు చేస్తారని ఆశ పడితే నిరాశే మిగిలింది. వేతన సవరణ ఊసే ఎత్తలేదు. ఎప్పుడో అమల్లోకి రావాల్సి ఉండగా ఉలుకూపలుకూ లేకుండా పోయింది. డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలి. దీనిపైనా మాటెత్తక పోవడం శోచనీయం.

- మాడవేడి వినోద్ కుమార్, బీసీటీయూ, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు

దాశరథిని విస్మరించడం సిగ్గుచేటు..

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

- ఆయన శత జయంతిని అధికారికంగా నిర్వహించాలి
- లేనిపక్షంలో జాగృతి ఆధ్వర్యంలో నిర్వహిస్తాం
- ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ, జాగృతి వ్యవస్థాపకురాలు కవిత

కంఠేశ్వర్, జూన్ 6 : ప్రజాకవి, రచయిత, తెలంగాణ విముక్తికోసం నిజాంతో పోరాటం చేసిన దాశరథి కృష్ణమాచార్యుల శత జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రభుత్వం నిర్వహించని పక్షంలో జాగృతి ఆధ్వర్యంలో నిర్వహిస్తామని స్పష్టం చేశారు. శుక్రవారం ఆమె దాశరథిని నిర్బంధించిన ఖిల్లా రామాలయాన్ని సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని ఎలుగెత్తిచాటి నిజాం పాలకులను గడగడలాడించిన మహోన్నతమైన వ్యక్తి ని విస్మరించడం ప్రభుత్వానికి సిగ్గు చేటన్నారు. నిజామాబాద్ జైలులో బొగ్గుతో ఆయన రాసిన తెలంగాణ విముక్తి పోరాట గీతాలు స్ఫూర్తి రగిలించాయన్నారు. ఆ రోజు ఉద్యమ ఆకాంక్షను రగిల్చిన ఈ ప్రాంతాన్ని భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకంగా తీర్చిదిద్దడానికి కేసీఆర్ ప్రభుత్వం కృషి చేసిందని తెలిపారు. ఎమ్మెల్సీగా తన నిధులు రూ. 40 లక్షలు వెచ్చించి అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాశరథి శత జయంతిని ఘనంగా నిర్వహించాలని పలుమార్లు కోరినా పట్టించుకోలేదన్నారు. దున్నపోతు మీద వానపడ్డట్లుగా ఈ ప్రభుత్వం తీరు ఉన్నదన్నారు. బిరుదు రాజు రామరాజు శత జయంతిని కూడా ఈ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. జిల్లా పరిసర ప్రాంతాల్లోని కవులు, రచయితలు, తెలంగాణ ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పించాలనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. తెలంగాణలో పుట్టిన దాశరథి ప్రతిభను ఇప్పటితరం వారికి పరిచయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదన్నారు.

తెలంగాణపై సోయిలేని ప్రభుత్వం శత జయంతి ఉత్సవాల విషయంలో ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటుందో వేచి చూస్తామన్నారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో వచ్చే జూలై 21, 22వ తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కవులు, రచయితలు, ఉద్యమకారులను ఆహ్వానించి అత్యంత ఘనంగా దాశరథి శత జయంతి ఉత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు.

వానకాలం వచ్చినా వడ్ల కొనుగోళ్లు పూర్తి చేయరా?

వానాకాలం వచ్చినా ఇప్పటికీ వడ్ల కొనుగోళ్లు పూర్తి చేయలేదని, రైతుల అవస్థలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. రేషన్ షాపుల వద్ద బియ్యం కోసం లబ్ధిదారులు గంటల తరబడి క్యూలో నిలబడుతున్నారని, వారి ఇబ్బందులను తొలగించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి వాటిని విస్మరించిందన్నారు. ప్రభుత్వాన్ని ప్రజలు ప్రశ్నించే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. జాగృతి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు సంపత్‌గౌడ్, జాగృతి జిల్లా అధ్యక్షుడు అవంతి, మాజీ మేయర్ దండు నీతూకిరణ్, ఘనపురం దేవేందర్, నరాల సుధాకర్, సిర్ప లింగం పాల్గొన్నారు.

79 మంది హోంగార్డులకు స్థానచలనం

సమావేశంలో మాట్లాడుతున్న కామారెడ్డి ఎస్పీ రాజేశ్ చంద్ర

- కౌన్సెలింగ్ ద్వారా బదిలీ
- కామారెడ్డి ఎస్పీ రాజేశ్‌చంద్ర వెల్లడి

కామారెడ్డి, జూన్ 6 : జిల్లాలో దీర్ఘకాలికంగా ఒకేచోట పనిచేస్తున్న 79 మంది హోంగార్డులను కౌన్సెలింగ్ ద్వారా బదిలీ చేసినట్లు కామారెడ్డి ఎస్పీ రాజేశ్‌చంద్ర తెలిపారు. బదిలీ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టినట్లు పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో తమకు కేటాయించిన పోలీసు స్టేషన్‌లో బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. జిల్లాలో మూడేండ్ల కన్నా ఎక్కువ కాలం ఒకే పోలీసుస్టేషన్ లేదా వివిధ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులను బదిలీ చేసినట్లు తెలిపారు. సంబంధిత హోంగార్డుల విల్లింగ్ స్టేషన్లు, వారి సీనియార్టీ, ఆరోగ్య పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని కౌన్సెలింగ్ ద్వారా పారదర్శకంగా బదిలీ ప్రక్రియ చేపట్టినట్లు వివరించారు. పోలీసు ఉద్యోగంలో క్రమశిక్షణకు ఎంతో ప్రాధాన్యం ఉంటుందని, ఒక్కరు చేసిన తప్పు మొత్తం శాఖపై ప్రభావం చూపుతుందన్నారు. హోంగార్డులు జాగ్రత్తగా, నిజాయితీగా విధులు నిర్వర్తించాలని సూచించారు. కొత్త నియామక ప్రాంతాల్లో హోంగార్డులు మరింత నిబద్ధతతో ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు. సమావేశంలో ఏఆర్ డీఎస్పీ యాకూబ్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ తిరుపయ్య, ఆర్ఐలు నవీన్ కుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ పాలనను గాలికొదిలేశారు..

- రాష్ట్రంలో పర్సంటేజీల రాజ్యం నడుస్తోంది
- ఇందిరమ్మ ఇండ్ల పేరిట అవినీతికి పాల్పడుతున్న కాంగ్రెస్ నాయకులు
- బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి

ఖలీల్‌వాడి/నందిపేట్, జూన్ 6 : సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో పాలనను గాలికొదిలేశారని బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో పర్సంటేజీల రాజ్యం నడుస్తున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ అంటేనే ఫేక్, ఫాల్స్, ఫ్రాడ్, ఫ్లాప్ అని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ అంటే బలహీన వర్గాలు, రైతుల సంక్షేమమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రజలను హింసించే భూతాల దేవి అని, ఆ పార్టీకి రాక్షస నీతి తప్ప రాజనీతి లేని కొరివి దెయ్యాల కొంప అని విమర్శించారు. బీఆర్ఎస్‌ను దెయ్యాల రాజ్యసమితి అంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై జీవన్‌రెడ్డి మండిపడ్డారు.కాంగ్రెస్ పార్టీనే జనం దేశ పాలిమేరలు దాటేలా కొడుతున్నా ఢిల్లీలో రాహుల్‌గాంధీకి, గల్లీలో రేవంత్‌రెడ్డికి ఏమాత్రం బుద్ధి రావడం లేదన్నారు. కేసీఆర్ తెలంగాణ సూర్యుడని, బీఆర్ఎస్ అగ్గి పుట్టించే ఉద్యమ భాస్వరమని పేర్కొన్నారు. గులాబీ సైన్యం తెలంగాణ రక్షణ కవచమని, తెలంగాణకు పట్టిన అసలు సిసలైన కొరివి దెయ్యం రేవంత్ అని వివరించారు.

రాష్ట్రంలో ఎక్కడ చూసినా నకిలీ సర్టిఫికెట్ల దందా సాగుతున్నదని, ఇందుకు జీహెచ్ఎంసీలో వెలుగు చూసిన ఫేక్ బర్త్, డెత్ సర్టిఫికెట్ల వ్యవహారమే నిదర్శనమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీలను అమలుచేయడంలో రేవంత్ సర్కార్ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఇస్తామని మొండిచెయ్యి చూపించారని మండిపడ్డారు. పంటలు కొనకుండా అన్నదాతలను ఆగం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ నేతలు బిల్లులు ఇప్పించి 20 శాతం కమీషన్ కొట్టేస్తున్నారని, ఇందిరమ్మ ఇండ్ల పథకం పేరుతో అవినీతికి పాల్పడుతున్నారని విమర్శించారు.

నమ్మించి, కోట్లు కొల్లగొట్టి..

- జిల్లా పోలీసులకు చిక్కిన సైబర్ మోసగాడు
- నిందితుడిపై దేశవ్యాప్తంగా 38 కేసులు నమోదు

పాండురంగ్ సుభాష్ మహాపంకర్

వినాయక్‌నగర్, జూన్ 6: వ్యాపారంలో పెట్టుబడుల పేరిట నమ్మించి దేశవ్యాప్తంగా వివిధ జిల్లాలకు చెందిన వ్యక్తుల బ్యాంకు ఖాతాల్లో నుంచి కోట్ల రూపాయలు కొల్లగొట్టిన సైబర్ మోసగాడిని నిజామాబాద్ జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులు పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. మహారాష్ట్రలోని ముంబై ప్రాంతంలో నివాసం ఉండే ఈ సైబర్ మోసగాడి వలలో చిక్కుకున్న శ్రావణ్ కుమార్ అనే బాధితుడు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టి నిందితుడిని పట్టుకున్నట్లు సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ డీఎస్పీ వెంకటేశ్వర రావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం ఆయన వెల్లడించారు. మహారాష్ట్రలోని ఈస్ట్ ముంబైలో రాము పటేల్ చాల్, ఈశ్వర్ నగర్ ఏరియా, కాజూపడి బోరివల్లి ప్రాంతాల్లో నివాసం ఉంటే పాండురంగ్ సుభాష్ మహాపంకర్ అనే యువకుడు ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో జనాలను నమ్మించి, వారి బ్యాంకు ఖాతాల్లోంచి డబ్బులు కాజేస్తూ సైబర్ మోసాలకు పాల్పడుతున్నాడు.

తాజాగా నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని శ్రావణ్ కుమార్ బ్యాంకు ఖాతాలో నుంచి రూ.31,36,900 నగదు కాజేశాడు. దీనిపై బాధితుడు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సదరు సైబర్ మోసగాడిపై దేశ వ్యాప్తంగా 38 కేసులు నమోదైనట్లు గుర్తించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీసీపీఎస్ సీఐ ముఖీద్ పాషా ,సిబ్బంది సురేశ్, నాగభూషణం, ప్రవీణ్, నరేశ్ బృందం మహారాష్ట్రలో తలదాచుకున్న పాండురంగ్‌ను గురువారం అరెస్టు చేసి, శుక్రవారం నిజామాబాద్ కోర్టులో హాజరుపర్చారు. నిందితుడికి 14 రోజులు జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో జైలుకు తరలించినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

పోలీసులకు చిక్కిన అంతర్రాష్ట్ర నేరస్తుడు

- 24 కేసుల్లో నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ
- పక్కా సమాచారం మేరకు పట్టుకున్న సీసీఎస్ బృందం

బబ్లూ బాలాజీ గైక్వాడ్

వినాయక్‌నగర్, జూన్ 6: వివిధ ప్రాంతాల్లో 24 కేసుల్లో నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ అయినప్పటికీ పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్న అంతర్రాష్ట్ర నేరస్తుడిని ఎట్టకేలకు నిజామాబాద్ పోలీసులు పట్టుకొన్నారు. కొంతకాలంగా వివిధ ప్రాంతాల్లో నేరాలకు పాల్పడి పోలీసుల కండ్లు కప్పి తిరుగుతున్న సదరు నేరస్తుడి కోసం అటు మహారాష్ట్ర, ఇటు తెలంగాణ ప్రాంతంలో పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. నిజామాబాద్ సీపీ సాయి చైతన్య ఆదేశాల మేరకు సీసీఎస్ (సెంట్రల్ క్రైమ్ స్టేషన్) బృందం ఎట్టకేలకు పట్టుకున్నది. ఈ మేరకు సీపీ సాయి చైతన్య వెల్లడించిన వివరాల మేరకు .. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా దెగ్లూర్ తాలూకా ఖానాపూర్ గ్రామానికి చెందిన బబ్లూ బాలాజీ గైక్వాడ్ అలియాస్ ధన్ల బాబు అనే పాత నేరస్తుడు కొంత కాలంగా కామారెడ్డి జిల్లాలో నేరాలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్నాడు. సదరు నేరస్తుడిపై వివిధ ప్రాంతాల్లో 24 నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. రెండురోజులుగా నిజామాబాద్ పరిసర ప్రాంతాల్లో మళ్లీ నేరా లు చేయడానికి తిరుగుతున్నట్లు సీపీకి సమాచారం అందింది. దీంతో ఆయన ఆదేశాల మేరకు సీసీఎస్ ఏసీపీ నాగేంద్ర చారితోపాటు సిబ్బంది అప్రమత్తమై తప్పించుకు తిరుగుతున్న అంతర్రాష్ట్ర నేరస్తుడిని పట్టుకున్నారు. నేరస్తుడిని కామారెడ్డి జిల్లా పోలీసులకు అప్పగించిన సీసీఎస్ టీమ్‌ను సీపీ సాయి చైతన్య ఈ సందర్భంగా అభినందించారు.